క్లుప్తంగా

కాలువ నిర్మాణ పనుల పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి వెంకటలక్ష్మి

సీతానగరం: మండలంలోని కామందొరవలసలో జీజీఎంపీ నిధులు రూ.9లక్షలతో చేపట్టిన రహదారి, కాలువ నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాగా కాలువ పనులు జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన వినతుల్లో భాగంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనలతో ఈ పనులు చేపట్టామన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



సీతానగరం మార్కెట్‌లో పారిశుధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ ఆదేశాలతో జరుగుతున్న పారిశుధ్య పనులతో పాటు దోమల నివారణకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పర్యవేక్షణలో శుక్రవారం మందు ద్రావణాన్ని పంచాయతీ కార్యదర్శులు పిచికారీ చేయిస్తున్నారు. సీతానగరం మార్కెట్‌లో బీటీ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా సర్పంచ్ తేరేజమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కార్యదర్శి జె.వెంకటరావు ఆధ్వర్యంలో బీటీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన కాలువలకు మరమ్మతులు చేపట్టడం, కాలువల్లో చెత్తను తొలగించే పనులు చేస్తున్నారు. బూర్జ గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుం సభ్యులకు నగదు అందిస్తున్న ఉద్యోగులు, నాయకులు

సాలూరు: మండలంలోని మామిడిపల్లికి చెందిన జర్జాపు శ్రీను ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌బీమా తక్షణ సాయం కింద శుక్రవారం పది వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు సువ్వాడ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వస్తువులు విక్రయిస్తే చర్యలు



నకిలీ కొబ్బరినూనె బాటిళ్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ దినకర్

పార్వతీపురం: వినియోగదారులకు నకిలీ వస్తువులను విక్రయిస్తే చర్యలు తప్పవని టౌన్ ఎస్‌ఐ దినకర్ అన్నారు. విజిలెన్స్ అధికారుల సమాచారం మేరకు శుక్రవారం పట్టణంలో బంధంవారి వీధిలోని రాందేవ్‌బాబా జనరల్ స్టోర్స్‌లో టౌన్ ఎస్‌ఐ పలు సరుకులను పరిశీలించారు. పారాచ్యూట్‌ని పోలి వున్న నకిలీ పారాచీట్ కొబ్బరినూనె బాటిళ్లను ఆయన గుర్తించారు. ఈ మేరకు సుమారు రూ.9,450లు విలువ గల కొబ్బరి నూనె బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒరిజనల్‌ను పోలిన నకిలీ వస్తువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలుతప్పవన్నారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆటస్థలం ఆక్రమణలపై సబ్‌కలెక్టర్ ఆరా..

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం ఆక్రమణలపై అధికారులు స్పందించారు. హైస్కూల్ మైదానం ఆక్రమణపై ఈ నెల 12న సాక్షిలో ప్రచురితమైన కథనంపై సబ్ కలెక్టర్ నూరల్ కమర్ విచారణ చేపట్టారు. శుక్రవారం హైస్కూల్‌ను సందర్శించి ఆక్రమణలపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాల్లో ఉన్న పూరిళ్లను పరిశీలించి తహసీల్దార్ చందక సత్యనారాయణ నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఆక్రమణలు తొలగించి, విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ 500 మంది గ్రామస్తులు సంతకాలు చేసి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ పాఠశాలలో 10వ తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కె.పెద్దవలస పాఠశాలకు..
రూ. 38 లక్షలు మంజూరు

- త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభం
- టీడీపీ హయాంలో రేకుల షెడ్డులో తరగతుల నిర్వహణ
- మంత్రి రాజన్నదొర చొరవతో నిధుల మంజూరుపై సర్వత్రా హర్షం



పాఠశాల భవనం నిర్మించనున్న ప్రాంతం..

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ కె. పెద్దవలస పాఠశాలకు మహర్దశ పట్టనుంది. టీడీపీ హయాంలో పూరిపాకలో తరగతులు నిర్వహించేవారు. త్వరలో పక్కా భవనాలు సిద్ధం కానున్నాయి. వివరాల్లోకి వెళితే.. కె. పెద్దవలస గ్రామంలో ఉండే పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2017లో తొలగించారు. దీంతో చెట్ల కింద తరగతులు నిర్వహించాల్సి రావడంతో గ్రామస్తులు, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కలసి పూరి పాక ఏర్పాటు చేశారు. పాఠశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులను పలు మార్లు కోరినా పట్టించుకోలేదని అప్పటి సర్పంచ్ తేలు జ్యోతి తెలిపారు. ఇదిలా ఉంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో నాడు – నేడు ఫేజ్ – 2 కింద పాఠశాలకు రూ. 38 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా మొదటి విడతలో రూ. 1.80 లక్షలు మంజూరుకాగా.. ఆ నిధులతో పునాదులు తీసి, ఇసుక, రాయి సమకూర్చారు.

రాజన్నదొర చొరవతో నిధులు మంజూరు

కె. పెద్దవలస గ్రామంలోని పాఠశాలకు పక్కా భవనం లేదన్న విషయాన్ని మార్కొండపుట్టి పంచాయతీ ప్రజా ప్రతినిధులు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఫేజ్ –2 కింద రూ. 38 లక్షలు మంజూరు చేయించారు. మొదటి విడతలో మంజూరైన నిధులతో పునాదులు తీసి, మెటీరియల్ సమకూర్చామని డీఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. త్వరలోనే మిగిలిన నిధులు మంజూరు కానున్నాయని, వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

గ్రామస్తుల సహాయంతో ..



గ్రామస్తుల సహాయంతో రేకుల షెడ్ వేశాం. పక్కా భవనాలు మంజూరు చేయాలని అప్పటి టీడీపీ పాలకులను కోరినా పట్టించుకోలేదు. ప్రస్తుత డిప్యూటీ సీఎం రాజన్నదొర పక్కా భవనాలకు నిధులు మంజూరు చేశారు.

– తేలు జ్యోతి, మాజీ సర్పంచ్, మార్కొండపుట్టి పంచాయతీ

త్వరగా పూర్తి చేయండి



పాఠశాల భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి. ప్రస్తుతం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టికి విషయం తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేయడం అభినందనీయం.

– పి.పోలిరాజు, గ్రామస్తుడు,. కె.పెద్దవలస



సిద్ధం చేసిన మెటీరియల్

సీజనల్ వ్యాధులపై తస్మాత్.. : డీఐఓ



పెదబొండపల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. తాళ్లబురిడి, పుట్టూరు, పెదబొండల్లి గ్రామాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తాళ్లబురిడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పలు అనారోగ్య లక్షణాలతో వచ్చిన వారికి నిర్వహించిన పరీక్షలు, అందజేసిన మందులు వివరాలు రికార్డులో పరిశీలించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎంతమంది ఉన్నారు, ఎంత మందికి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు... అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎప్పటికప్పుడు సర్వే చేసి జ్వరాలతో ఉన్న వారిని గుర్తించి, ప్రాథమిక దశలోనే వైద్యం అందజేస్తే తీవ్రతను లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆయన అక్కడ డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. పుట్టూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం వద్ద 104 వాహనంలో వైద్య పరికరాలు, మందులు తనిఖీ చేసి ప్రజలకు వీటిని ఆయా సందర్భాల్లో వినియోగించాలన్నారు. అనంతరం పెదబొండపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో డాక్టర్ జగన్‌మోహన్‌రావు సమీక్ష నిర్వహించి పలు ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించి పురోగతి సాధించాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ అనూష, డాక్టర్ ధరణి, ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు పరిశీలన



ఈ - క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: మండల పరిధిలోని రైతులు రబీ సీజన్ పంటలు ఈ – క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయించుకుంటేనే రైతులు అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఏడీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మార్‌నగరం, వెంకంపేట గ్రామాల్లో జరుగుతున్న ఈ – క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకుంటేనే క్రాప్ ఇన్సురెన్సు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, పీఎం కిసాన్ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అశోక్, వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి



సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసిన యువకులు

బలిజిపేట: పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం వద్ద సుబాస్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబోస్ దేశభక్తిని పునస్మరణ చేసుకున్నారు. ఆయన పాల్గొన్న ఉద్యమాలు, రచించిన గ్రంథాలు, వచ్చిన బిరుదులను గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఎన్.నవీన్, జి.సింహాచలం, ఎం.వాసు, సిహెచ్.శంకరరావు, జి.శ్రావణ్, కె.గౌరీనాథ్, కె.సతీష్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బోస్ త్యాగం మరువలేనిది

సాలూరు: భారత స్వాతంత్ర్యోద్యమంలో సుభాష్ చంద్రబోస్ త్యాగం మరువలేనిదని మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ అన్నారు. చంద్రబోస్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వతంత్ర సంగ్రామంలో చంద్రబోస్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సభ్యులు రవి, ఉమాశంకర్, జగన్‌మోహన్‌రావు, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



బలిజిపేటలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేసి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సంక్షేమ పథకాలను పక్కాగా పార్టీలకతీతంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బలిజిపేటలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో మహిళల జీవనోపాధులు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల పిల్లలను అందరూ బడులకు పంపుతున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు తెచ్చి అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందుతుందన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని అన్నారు. ప్రజలు దీన్ని గుర్తించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పేద వారికి కార్పొరేట్ వైద్యం అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.వకీరునాయుడు, బలిజిపేట ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, జ్యోతిష్, ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, డి.సుధ, సన్నిబాబు, జి.సత్యంనాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

28వ సారి రక్తదానం



జిల్లా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న విద్యాసాగర్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం ఎమ్మార్ నగరం నివాసి దేవుపల్లి నందిని అనే గర్భిణి రక్తహీనతతో శుక్రవారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేరింది. రక్తం అందక ఆమె బంధువులు పార్వతీపురం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామకృష్ణకు విషయం తెలిపారు. విషయం తెలుసుకున్న పార్వతీపురం పట్టణానికి చెందిన మాదా విద్యాసాగర్ వెంటనే స్పందించి ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్‌లో 28వ సారి రక్తదానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడారు. 28వ సారి రక్తదానం చేసిన మాదా విద్యాసాగర్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, గర్భిణి బంధువులు అభినందించారు.

నిరంతర కృషితోనే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు నిరంతర కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం బెలగాం ప్రాంతంలో గల ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జయహో భారత్ – ఇన్వెస్టర్ శిరోమణి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో ఎమ్మెల్సీ ఎలక్షన్ క్యాంపెయిన్ సమయంలో పాఠశాలకు విచ్చేసినప్పుడు నా దృష్టికి రోడ్డు సమస్యను తీసుకురావడం జరిగిందని, అప్పుడు మీ అందరికీ ఒక మాట ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారమే విద్యార్థుల శ్రేయస్సు కోరి అనతికాలంలోనే రహదారి నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందన్నారు. జయహో భారత్ కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా వారిలో దేశభక్తిని పెంపొందించవచ్చన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ ప్రతిభ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బి.జగదీష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



మకరతోరణంతో దర్శనమిస్తున్న శ్యామలమ్మ



విశేష అలంకరణలో కామాక్షమ్మ



పార్వతీపురం: కోటదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి కుంకుమ పూజలలో పాల్గొన్న భక్తులు



సీతానగరం: లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కుంకుమ పూజలు

సాలూరు: శ్రావణ శుక్రవారం పూజలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. పట్టణంలోని శ్యామలమ్మ, కన్యకాపరమేశ్వరి, కామాక్షమ్మ, తదితర ఆలయాల్లో విశేష పూజలు చేపట్టారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివెరిసింది.

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలోని శ్రీకోటదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. ఈ నెల 25న వరలక్ష్మీ వ్రతం, 31న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్టు పూజారులు తెలిపారు. సెప్టెంబర్ 15వరకు ఆలయంలో శ్రావణ మాస పూజలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు

సీతానగరం: శ్రావణ మాసం మొదటి శుక్రవారం వివిధ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి, లక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు వందలాది మంది భక్తులచే అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు. గుచ్చిమి, మరిపివలస, కేఎస్ పురం గ్రామాల ఆలయాల్లో మొదటి శ్రావణ శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు.

బలిజిపేటలో..

బలిజిపేట: శ్రావణ మాసంలో మొదటి శుక్రవారం ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పాటు మొదటి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

సర్వీసులను క్రమబద్ధీకరించాలి

పార్వతీపురం: ట్రైబల్ వెల్ఫేర్, నాన్ ఐటీడీఏలో దినసరి వేతనంపై, టైం స్కేల్ వేతనంపై పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ టైం స్కేల్ ఉద్యోగులు కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. మూడు దశాబ్దాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం సర్వీసుల క్రమబద్ధీకరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జూన్ 2014 నాటికి ఐదేళ్లు పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గత పదేళ్లుగా టైం స్కేల్ వేతనంపై పనిచేస్తున్న ఉద్యోగులను కూడా క్రమబద్ధీకరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

శరవేగంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు



శరవేగంగా జరుగుతున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు

పార్వతీపురం టౌన్: జిల్లాకే తలమానికంగా పార్వతీపురం పట్టణంలో నిర్మాణమవుతున్న మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం మోల్డింగ్ పనులను ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్రంలో గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులకు జిల్లా అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసి చూపుతున్నారు. జిల్లాలో సామాజిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.కోట్లు వెచ్చించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. సీహెచ్‌సీ నిర్మాణ పనులు జరుగుతుండగానే, అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించడానికి డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు.

నేడే పోలింగ్

కురుపాం: మండలంలోని గుమ్మ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. గుమ్మ పంచాయతీ కేంద్రంలోని ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో రెండు గదులను పోలింగ్‌కు కేటాయించారు. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా.. వారిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ బలపరిచిన అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.